క్లుప్తంగా

మహాసభల విజయవంతానికి పిలుపు

అల్లిపురం: సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కంచరపాలెం మెట్టు నుంచి పాత ఐటీఐ వరకు ప్రజా ప్రదర్శన, అనంతరం ఐటీఐ జంక్షన్‌లో బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఈ మహాసభలో పార్టీ కార్యదర్శి కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో గత మూడు సంవత్సరాలుగా పార్టీ నిర్వహించిన ఉద్యమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. అదే విధంగా రాబోయే మూడు సంవత్సరాల ఉద్యమ రూపకల్పన చర్చ జరుగుతుందన్నారు. సీపీఐ చేసే ఈ పోరాటాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కేజీహెచ్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని కేజీహెచ్‌కు వస్తున్న రోగుల సహాయకుల దాహార్తి తీర్చడం కోసం కేజీహెచ్ ఆవరణలో ఇస్కాన్ సంస్థ సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఇస్కాన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి




గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: ఇటీవల ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందిన పీజే గణేష్‌కుమార్ శుక్రవారం 38వ వార్డు మాజీ కార్పొరేటర్ బి. ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్‌కుమార్‌ను అభినందించి సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. గణేష్‌కుమార్ మాట్లాడుతూ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగార్రాజు, విశాఖపట్నం జిల్లా నాయకులు బి.వి. అశోకుమార్, డి. శివనారాయణ, ఎస్. సాయికృష్ణ, డి. రవితేజ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉత్తరం గేట్ తెరవాలని వినతి

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డు వద్ద జీవీఎంసీ చేపట్టిన మరమ్మతు పనుల నేపథ్యంలో రోడ్డు మూసేయడంతో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఉత్తర గేట్ తెరవాలని బురుజుపేటకు చెందిన యాళ్ల కిషోర్‌బాబు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మరమతుల నేపథ్యంలో టూవీలర్స్, ఆటో కార్మికులు ఇటువైపు వచ్చేస్తుండడంతో ఈ ప్రాంత వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, చిన్నపాటి గేట్ తెరిచినా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు వెళ్లలేని దృష్ట్యా మరమ్మతు పనులు పూర్తయ్యే వరకైనా గేట్ తెరవాలని ఆ వినతిలో పేర్కొన్నారు.

వైభవుడికి లక్ష మల్లెల అర్చన



లక్ష మల్లెల పూజలు అందుకున్న వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి లక్ష మల్లెలతో అర్చన చేశారు. ఉదయాస్తమాన సేవల అనంతరం ఉదయం 9 గంటలకు ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై ఆసీనుడైన వైభవ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకులు వాసు, శేషస్వాముల ఆధ్వర్యంలో లక్ష మల్లెలతో పూజలు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చేపల బేజార్

- రహదారిలో నిర్వహణతో పాదచారులు.. వాహన చోదకుల ఇక్కట్లు
- చేపల వ్యర్థాలతో అలుముకుంటున్న దుర్గంధం
- మార్కెట్‌ను దగ్గరలోని రామకృష్ణా రైతుమార్కెట్‌లోకి తరలించాలని పలువురి డిమాండ్



అమ్మకాలతో చేపల మార్కెట్ బిజీ



రామకృష్ణా రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలు



పాతబస్టాండ్ రోడ్డుపైనే చేపల మార్కెట్

జగదాంబ: పాత బస్టాండ్ పక్కన ప్రధాన రహదారిలో ఉన్న చేపల మార్కెట్‌ను రామకృష్ణా రైతుబజార్‌కు మార్చాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. పాతనగరంలో కీలకమైన ఏవీఎన్ కళాశాల డౌన్, పాత బస్టాండ్ నుండి డాల్ఫిన్ హోటల్‌కు.. అక్కడి నుండి నగరంలోకి రావడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ దారి గుండా ప్రయాణించే పాదచారులు, వాహన చోదకులు ఇక్కడి చేపల మార్కెట్ వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్కెట్ రహదారిలో ఉండడం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అడుగు తీసి అడుగెయ్యడానికి కూడా వీల్లేకుండా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో అయితే ఇక్కడ కొనుగోలుదారులతో తిరనాళ్లలా మారుతుంటుంది. జీవీఎంసీ 35వ వార్డులోని పాత బస్టాండ్ పరిధిలోని ఫ్రూట్‌మార్కెట్ పక్కన గల ఈ చేపల మార్కెట్ వల్ల ఉదయం వేళల్లో ఈ దారి గుండా ప్రయాణించే పోర్టు ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా పెట్టిన వాహనాలు, వాటి పక్కనే దుకాణాలు, కొనుగోలు కోసం వచ్చే జనాలతో ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

దుర్వాసనతో సమస్య..

ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, దుర్గమాంబ సమాజం వంటి ప్రాంతాలకు దగ్గరగా ఉన్న ఫ్రూట్‌మార్కెట్ పక్కనే రహదారిపై చేపల మార్కెట్ ఉండడంతో చేపల వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. దీంతో దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వ్యాపారులు చేపల నీరు, వ్యర్థాలు రోడ్డు పక్కనే పడేసి వెళ్లిపోవడంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదాలు..

రహదారి పక్కనే మార్కెట్ ఉండడంతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఓ మహిళను బస్సు ఢీకొనడంతో ఆమె మృతి చెందగా మరి కొందరు గాయాలపాలయ్యారు. రోడ్డు మీద చేపల మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు వచ్చే వారు వాహనాలను గమనించకపోవడం వల్ల ఈ దుస్థితి వస్తోందని స్థానికులంటున్నారు.

రైతుబజార్‌లో...

ఇక్కడ రామకృష్ణా రైతు మార్కెట్‌లో 152 దుకాణాలు ఉన్నాయి. వీటిలో 70 నుంచి 80 దుకాణాల్లో మాత్రమే వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. మిగతా దుకాణాలన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రధాన రహదారిపై జరుగుతున్న చేపల వ్యాపారులందరికీ ఈ మార్కెట్‌లో దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు నివారించవచ్చు. అలాగే ప్రమాదాలు జరగకుండా కూడా చూడవచ్చు.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..

శనివారం, మంగళవారం, శుక్రవారం రాత్రి వేళల్లో చేపల లోడుతో వాహనాలు వస్తుంటాయి. పగలు మార్కెట్‌తోను, రాత్రివేళల్లో వాహనాలతోను చాలా ఇబ్బందిగా ఉంది. చేపల అమ్మకాలు, చేపల లోడుతో వచ్చే వాహనాల వల్ల ఈ ప్రాంతమంతా దుర్గంధం అలుముకుని ఉండలేకపోతున్నాం. ప్రధాన రహదారిపై చేపల మార్కెట్ నిర్వహణతోనే ఈ సమస్యలు. మార్కెట్‌ను రామకృష్ణా రైతుమార్కెట్‌లోకి తరలిస్తే ఈ సమస్యలు ఉండవు.

– ఎం. శ్రీనివాస్, 35వ వార్డు నివాసి

నడవడానికి దారివ్వరు..

ఆదివారం వస్తే చాలు కనీసం నడవడానికి కూడా దారివ్వడంలేదు. ఏవీఎన్ కళాశాల నుంచి వచ్చే వారందరికీ ఇదే ప్రధాన రహదారి. కానీ నడిచే దారి లేదు. చేపల వ్యాపారులు, కొనుగోలుదారులతో అంతా ఒకటే రద్దీగా ఉంటుంది. దుర్వాసన కూడా చుట్టుపక్కల ప్రాంతాల వరకు వ్యాపిస్తుంది. చేపల మార్కెట్‌ను రామకృష్ణా రైతుమార్కెట్‌లోకి మార్చాలని కోరుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పి. నరేంద్ర, స్థానికుడు, వన్‌టౌన్

న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శినికి నివాళి



సంతాప సభలో పాల్గొన్న ఐఎల్‌ఏ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మాటూరి గిరిజ ప్రియదర్శిని అకాల మరణానికి చింతిస్తూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన (ఐఎల్‌ఏ) విశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సంతాప సభ నిర్వహించారు. ఆమె విశిష్ట సేవలను కొనియాడారు. తోటి న్యాయమూర్తులతో స్నేహభావంతో ఉంటూ తను నమ్ముకున్న వృత్తిలో నైపుణ్యం సంపాదించుకున్నారని సంతాప సభలో పాల్గొన్న వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్‌ఏ జిల్లా అధ్యక్షుడు యడ్ల నరేష్, కార్యదర్శి ఎం. రవికుమార్, ఐఎల్‌ఏ స్టేట్ కమిటీ మెంబర్లు తెరపిల్లి సత్యారావు, సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ, వడ్డి రవిబాబు, బలగ సత్యారావు, డీపీ చంద్రశేఖర్, పి. విద్యాసాగర్, ముప్పిడి గౌరీ ప్రసాద్, నరేష్, మహిళా న్యాయవాదులు అనూష, మణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ విభాగంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. టెన్త్ పాసైన వారికి 2 నెలలు శిక్షణ ఇస్తామన్నారు. 15 నుంచి 44 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8500502395 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విశాఖపట్నం ఒక ప్రత్యేక నగరం పుస్తకావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు తదితరులు

దాబాగార్డెన్స్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ రచయిత ర్యాలీ ప్రసాద్ రచించిన 'విశాఖపట్నం ఒక ప్రత్యేక నగరం.. చరిత్ర' పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ ఈనాటి తరానికి విశాఖపట్నం విశిష్టతను తెలిపేదే ఈ పుస్తకమని, సోషల్ మీడియా కాలంలో పుస్తక పఠనం చాలా తగ్గిందని, యువత మన ప్రాంతం చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఎస్. బుచ్చిరెడ్డి మాట్లాడుతూ చరిత్ర రచనలు రాబోయే తరాలకు అవసరమని, రచయిత ర్యాలీ ప్రసాద్ ఆ పని చేస్తున్నారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త తాడి మాచారెడ్డి మాట్లాడుతూ చరిత్రను ఆసక్తిగా చదివే విధంగా రచయిత ఈ పుస్తకాన్ని రచించారన్నారు. రచయిత ర్యాలీ ప్రసాద్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుని కాలం నుంచి విశాఖపట్నం చారిత్రాత్మకంగా తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తుందని, ఆ చరిత్ర ఇప్పటి తరానికి అందించాలని ఈ పుస్తకం రాసినట్టు తెలిపారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం. సూర్య భాస్కర్, టీవీవీ సత్యనారాయణ, కె. రామరాజు, వడిశెట్టి భాస్కర రెడ్డి, పలువురు సాహిత్యాభిమానులు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టీ సొమ్ము ఎగ్గొట్టిన ఇద్దరి అరెస్టు

దాబాగార్డెన్స్: చిట్టీ సొమ్ము ఎగ్గొట్టి పత్తా లేకుండా పోయిన దంపతులను శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తెలిపిన వివరాలివి. పాతనగరానికి చెందిన దిలీప్ జైన్ నుంచి వినయ్‌కుమార్, అతని భార్య పావని చిట్టీల రూపంలో సుమారు రూ.కోటి వరకు కట్టించుకుని, మోసం చేసి చాలా రోజులుగా తప్పించుకు తిరుగుతున్నారని పోలీసులు తెలిపారు. దిలీప్ జైన్ చేసిన ఫిర్యాదు మేరకు వినయ్‌కుమార్, పావనిని పట్టుకున్నామన్నారు. వీరిది ఆరిలోవ అని, ఒక్క దిలీప్‌కుమార్‌నే కాకుండా ఎంతో మంది నుంచి వీరు కోట్లాది రూపాయలు కొల్లగొట్టినట్టు విచారణలో తేలిందన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ జీడీ బాబు తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారికి తులసీ పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలి చే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

భారత్ విజయాన్ని కాంక్షిస్తూ గాయత్రీ హోమం



గాయత్రీ హోమం నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: ఆపరేషన్ సిందూర్-2 విజయవంతంగా నిర్వహించిన భారత ఆర్మీకి మనోధైర్యం కలగాలని భారతమాతను ప్రార్థిస్తూ శుక్రవారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో గాయత్రీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ తెలుగు తేజం వీర జవాన్ మురళీ నాయక్‌కు, ఈ పోరాటంలో వీర మరణం పొందిన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ విజయంతో ముందుకు దూసుకుపోతున్న భారతదేశ సైన్యానికి వందనాలు తెలిపారు. మన సైనికులకు మరింత మనోధైర్యం కలగాలని కాంక్షిస్తూ కుల, మతాలకు అతీతంగా గాయత్రి హోమం నిర్వహించామని తెలిపారు. జయహో ఆర్మీ సైన్యమంటూ ట్యూషన్ విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సీహెచ్ పైడిరాజు, వి. నల్లరాజు, ట్యూషన్ పిల్లలు, ఆశ్రమ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం



కార్యక్రమానికి హాజరైన వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు

మహారాణిపేట: వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవం, తలసేమియా డేను పురస్కరించుకుని ఆ వ్యాధితో బాధపడుతున్న 50 మంది చిన్నారులు రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా సత్యసాయి ట్రస్ట్ ప్రెసిడెంట్ శివకోటి మధుసూదనరావు, సైకాలజిస్ట్ డాక్టర్ పూజిత జోస్యుల, డాక్టర్ మాధవీలత, జేఆర్‌సీ కోఆర్డినేటర్ ఎండీ రెహ్మతుల్లా తదితరులు రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు సర్ జీన్ హేనరీ దునంట్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే చిన్నారులకు బహుమతులు, రెడ్‌క్రాస్ వలంటీర్లకు మెడల్లు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ పి. రవికుమార్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ బి.సంతోష్, నర్సింగ్ కోఆర్డినేటర్ ఎ. గీత తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యం



బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న మేయర్

దాబాగార్డెన్స్: నగర పరిశుభ్రత, సుందరీకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని స్వయంగా నడిపి, దాని పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో సుందరమైన విశాఖ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని, విశాఖకు సువిశాలమైన సాగర తీరం ఉందని, ఎంతో మంది పర్యాటకులు, సందర్శకులు విశాఖ నగరానికి వస్తుంటారని తెలిపారు. వారికి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు సాగర తీరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. వ్యర్థాలు వేయకుండా సందర్శకులు, పర్యాటకులు, దుకాణదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని అధికారులను మేయర్ ఆదేశించారు.

సిందూర్‌కు సంఘీభావంగా..



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గత కొన్ని రోజుల నుంచి ఆందోళన చేస్తున్న ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ చేతులు, నుదుటికి సిందూరం పెట్టుకుని ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం ప్రకటించారు. - ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అయ్యో.. దారేదీ?



టౌన్ కొత్తరోడ్డు వద్ద పాదచారులు, వాహన చోదకుల రాకపోకలు నిలుపుదల చేసి పనులు నిర్వహిస్తున్నారు. ఇది ప్రధాన మార్గం కావడం.. పనులు నత్తనడకన సాగుతుండడంతో అంతా అవస్థ పడుతున్నారు. - ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆర్టీసీ అధికారుల నిజాయితీ

మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్ కొద్ది గంటల్లోనే అందజేత



పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను స్వాతికి అందజేస్తున్న స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్

దాబాగార్డెన్స్: విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన రెడ్డి స్వాతి తన భర్త ప్రభాకరరావుతో కలిసి రాజమండ్రి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో శుక్రవారం సాయంత్రం విశాఖ (ద్వారకాబస్టేషన్) చేరుకున్నారు. ఇక్కడి నుంచి రాజమండ్రి వెళ్లేందుకు బస్సు కోసం ద్వారకాబస్టేషన్లో వేచి ఉన్నారు. ఇంతలో స్వాతి తన వద్ద ఉన్న విలువైన ఫోన్‌ను పోగొట్టుకుంది. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఆర్టీసీ అధికారులు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. సిబ్బంది ఆమె నంబర్ ఆధారంగా దొంగిలించబడ్డ సెల్‌ఫోన్‌ను కొద్ది గంటల్లోనే స్వాధీనపరచుకున్నారు. ఆ ఫోన్‌ను రెడ్డి స్వాతికి స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ సెక్యూరిటీ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎంవీ రావుతో పాటు సెక్యూరిటీ సిబ్బంది వెన్నెల ప్రసాద్, సంతోషి పాల్గొన్నారు.

విశాఖ డిజైనర్స్ అసోసియేషన్ ఏర్పాటు



డిజైనర్స్ లోగో ఆవిష్కరిస్తున్న సీపీ బాగ్చీ తదితరులు

అల్లిపురం: విశాఖ డిజైనర్స్ అసోసియేషన్ ఏర్పడింది. ఈమేరకు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అసోసియేషన్ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వాములవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను సీపీ అభినందించారు.

నేడు చిత్ర కవిత్వంపై అవగాహన

మురళీనగర్: స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో చిత్ర కవిత్వం, తెలుగు భాషా విశిష్టతపై అవగాహన సదస్సు శనివారం నిర్వహిస్తామని నిర్వాహకురాలు బీకే అపరంజి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి తెలుగు భాషావేత్త ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్ వివరిస్తారని చెప్పారు. విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు పాల్గొనాలని కోరారు.

ఫైరింగ్‌లో ప్రథమ స్థానం

సైనిక్ స్కూల్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



ఫైరింగ్‌లో ప్రథమ స్థానం పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లు హర్ష, రమేష్

సీతంపేట: విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో జరుగుతున్న కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రతిభ చూపారు. వెలగల హర్షవర్ధన్, మురుకుర్తి రమేష్ శుక్రవారం జరిగిన ఫైరింగ్ కాంపిటీషన్‌లో ఐదుకు ఐదు పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాధం, మేజర్ బ్రహ్మానందరెడ్డి, సుబేదార్ జయప్రకాష్, నేతాజీ, శ్యామలరావు అభినందించారు. అనంతరం సైనిక్ స్కూల్‌లోని మ్యూజియంలో వివిధ మిస్సైల్స్, క్షిపణులు, ట్యాంకులు, ఇతర యుద్ధ పరికరాలను సందర్శించి, యుద్ధ వీరులు, సేవామెడల్స్ విశిష్టత తెలుసుకున్నారు.

డ్రై డేతో వ్యాధుల నివారణ



అక్కయ్యపాలెంలో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది

సీతంపేట: వారం రోజులు పైబడి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ బి.శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెంలో ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత గురించి శుక్రవారం స్థానికులకు అవగాహన కల్పించారు. వార్డులో డ్రైడే అమలు తీరును పరిశీలించారు. సిబ్బందితో ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి, దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వారానికి ఒక రోజు (ప్రతి శుక్రవారం) డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులలో నీటిని తొలగించి, ఆరబెట్టి మరలా నీటిని పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ హెల్త్ అసిస్టెంట్ కె.ఎస్.ఎస్.నారాయణ, జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది పాల్గొన్నారు.